19072024-MAI-04_Layout 1 7/19/2024 3:23 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## నేపాల్‌లో కుర్చీలాట

**నేపాల్‌లో** మరోసారి రాజకీయ అస్థిరత చోటుచేసుకుని ప్రభుత్వం మారిపోయింది. 2008లో రాజరిక వ్యవస్థ రద్దయిపోయి గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన తర్వాత గడిచిన 16 ఏండ్ల కాల వ్యవధిలో అక్కడ 13 ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. గత రెండేండ్లలోనే మూడో ప్రభుత్వం కొలువుదీరింది. పుష్పకమల్ దహల్ అలియాస్ ప్రచండ ఇటీవల అవిశ్వాస తీర్మానం కారణంగా తన పదవి కోల్పోయారు. ఆయన స్థానంలో చైనా అనుకూల నేపాల్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కేపీ శర్మ ఓలీ.. నేపాల్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ప్రధాని పదవి చేపట్టారు. పదే పదే సంకీర్ణాలు మారుతుండటం వల్ల ప్రధానులూ మారిపోవడం నేపాల్‌లో పరిపాటి అయ్యింది. ఓలీ ప్రధాని పదవి చేపట్టడం ఇది నాలుగోసారి.

ఇలా ఎడతెరిపి లేకుండా సాగుతున్న కుర్చీలాటకు ఎన్నికల వ్యవస్థలో ఉన్న చిక్కులు కారణమవుతున్నాయి. నేపాల్ పార్లమెంటులో మొత్తం 275 స్థానాలుండగా అందులో 165 స్థానాలను మెజారిటీ ప్రాతిపదికన, 110 స్థానాలను దామాషా పద్ధతిన ఎన్నుకుంటున్నారు. దళితులు, మహిళలు, మైనారిటీలు సహా పీడిత వర్గాలన్నిటికీ ప్రాతినిధ్యం కల్పించి, కేంద్రీకృత అధికారం స్థానంలో సమాఖ్యవాదం తేవాలనే ఉద్దేశంతో ఈ విధానం తెచ్చారు. ఈ మిశ్రమ విధానం ఫలితంగా ఏ ఒక్క పార్టీకీ పూర్తి మెజారిటీ రాక సంకీర్ణాలు తప్పడం లేదు. చిన్న చిన్న పార్టీలు పిడికెడు స్థానాలు గెలుస్తున్నందు వల్ల పెద్ద పార్టీల్లో దేనికీ పూర్తి మెజారిటీ వచ్చే అవకాశం ఉండటం లేదన్నది వాస్తవం. రాజకీయ అస్థిరతకు కారణమవుతున్న ఈ రెండు రకాల ఎన్నికల విధానాన్ని మార్చి, అంతటా మెజారిటీ పద్ధతి తేవాలని నూతన ప్రధాని ఓలీ భావిస్తున్నారు. అయితే ఇది తేనెతుట్టెను కదిలించడమే అవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. రద్దయిపోయిన రాజరిక వ్యవస్థ, హిందూరాజ్య పునరుద్ధరణ డిమాండ్లు తలెత్తవచ్చనే సందేహాలే అందుకు కారణం.

కొత్త ప్రధాని ముందు అనేక సవాళ్లున్నాయనేది ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. సరిహద్దు దేశాలైన భారత్, చైనాలతో సమతూకం పాటించడం అనేది అందులో ఒకటి. నేపాల్‌లో చైనా ప్రాబల్యం పెరుగుతుండటం వల్ల భారత్ పాత్ర పెద్దన్నయ్య నుంచి సమవుజ్జీ స్థాయికి చేరుకుంది. నేపాల్‌తో సహా యావత్తు దక్షిణాసియాపై పట్టు కోసం భారత్, చైనా మధ్య పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా అనుకూల ఓలీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం భారత్‌కు ఒక విధంగా ప్రతికూల పరిణామమే. గతంలో భారత్-నేపాల్ సంబంధాల్లో పొరపొచ్చాలకు ఓలీ కారణమయ్యారన్న సంగతి మరచిపోరాదు. చమురు, ఆహార పదార్థాలతో సహా నిత్యావసర వస్తువుల కోసం నేపాల్ భారత్‌పైనే ఎక్కువగా ఆధారపడుతున్నది. అలాగే సుమారు 40 లక్షల మంది నేపాలీలు చదువు, ఉపాధి కోసం భారత్‌కు వలస వస్తుంటారు. చైనా పోటీ వల్ల భారత్ నేపాల్‌లో పెట్టుబడులు కూడా పెంచుకుంటున్నది. గతంలో ఓలీ రెండు దేశాల వాణిజ్యంలో ప్రతిష్టంభన తెచ్చినప్పుడు నేపాలీ ప్రజలు ఎంతగానో ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఓలీ మరోసారి భారత్‌తో గిల్లికజ్జాలకు దిగకపోవచ్చనే వాదన వినిపిస్తున్నది. అదే జరిగితే ఉభయ దేశాలకూ శ్రేయస్కరం.

# అటకెక్కుతున్న కాంగ్రెస్ హామీలు

**రితేష్ దేశ్‌ముఖ్ బాలీవుడ్ ప్రముఖ నటుడు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కుమారుడు. ఆయన భార్య జెనీలియా కూడా మంచి నటి. భార్యాభర్తలిద్దరూ కలిసి సరదాగా రీల్స్ కూడా చేస్తుంటారు. ఒక రీల్‌లో 'పెళ్లికి ముందు డార్లింగ్ అంటూ రోజూ పొగిడేవాడివి, బహుమతులు, పువ్వులు ఇచ్చేవాడివి. పెళ్లయ్యాక ఏమైంది? అలా ప్రేమించడం లేద'ని జెనీలియా అడుగుతుంది. 'ప్రచారం ముగిసింది, పోలింగ్ ముగిసింది' అని రితేష్ దేశ్‌ముఖ్ బదులిస్తాడు. నిజమే కదా? పోలింగ్‌కు ముందు రాజకీయ నాయకులు ఇంటింటికి తిరిగి ఓటర్లను ప్రేమ వర్షంలో ముంచెత్తుతారు కానీ, డబ్బాలో ఓట్లు పడి చేతిలోకి అధికారం వచ్చాక ఇక ప్రజలను వారెందుకు ప్రేమిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా చేసిన రీల్ గుర్తుకువస్తున్నది.**



**బుద్దా మురళి**



బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను యథావిధిగా అమలుచేసేందుకే నానా తంటాలు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను సైతం సరిగా అమలు చేయలేక చతికిలపడుతున్నది. హైదరాబాద్‌లోని అశోక్ నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లో పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే సంస్థలు కొన్ని వందలున్నాయి. వేలమంది నిరుద్యోగులు కోటి ఆశలతో అక్కడ పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటారు. నగర కేంద్ర గ్రంథాలయంలోకి వెళ్లి స్వయంగా చూస్తే తప్ప నమ్మలేనంత మంది చదువుకుంటుంటారు. వరండాలో, ఓపెన్‌ప్లేస్‌లో, చెట్ల కింద, వాహనాల స్టాండ్ వద్ద ఎక్కడ చూసినా విద్యార్థి గుంపులే. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగర కేంద్ర గ్రంథాలయం తలుపులు మూసి నిరుద్యోగులను బయటకు రాకుండా పోలీసులు కాపలా ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు, ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్‌గాంధీ అక్కడికి వచ్చి నిరుద్యోగులతో చాలాసేపు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఎలా జారీ చేయనున్నామో తేదీలతో సహా పత్రికల మొదటిపేజీల్లో ప్రకటనల ద్వారా హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిశాయి, కాంగ్రెస్ పార్టీకి అధికార పీఠం దక్కింది. నాడు వార్తాపత్రిక జీవితం ఒకరోజే కదా అనుకున్నారేమో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ ప్రకటనలను గాలికివదిలేశారు.

ఇదిలా ఉంటే ఇప్పుడు డీఎస్సీ పరీక్ష తేదీ మార్చడంతో పాటు గ్రూప్ 2, 3 పరీక్షల నోటిఫికేషన్ ఇవ్వాలని నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే వారిని కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేసింది. గ్రంథాలయంలో నిర్బంధించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించి ప్రక్రియ అంతా పూర్తయ్యాక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలు ఇవ్వడం తప్ప కొత్త ఉద్యోగాలు ఇవ్వడం లేదు. లక్షలాది ఖాళీలున్నాయి, ఎప్పుడు భర్తీ చేస్తారని నిరుద్యోగులు ప్రశ్నిస్తుంటే, తిన్నదరగక దీక్షలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు నిరుద్యోగులను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతుండటం శోచనీయం.

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కర్నె శిరీష (బర్రెలక్క) అనే ఓ యువతి 'నాకు ఉద్యోగం లేక నేను బర్రెలు కాసుకుంటున్న ఫ్రెండ్స్' అంటూ ఓ వీడియో చేసి బాగా పాపులరైంది. ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదంటూ యూట్యూబ్ ఛానల్ ద్వారా సంచలనం సృష్టించింది. ఏకంగా కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచింది. ఆ ఎన్నికల్లో ఆమె ఓడిపోయింది, అది వేరే విషయం. కానీ, రేవంత్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేయడం లేదంటూ ఆమె ఆందోళన చేస్తే కాంగ్రెస్ సర్కార్ ఆమెను అరెస్టు చేసింది. కేసీఆర్ హయామే బాగుండేదని ఇప్పుడు బర్రెలక్క కూడా అంటున్నది. ఒక్క ఆమెనే కాదు, మహబూబ్‌నగర్ జిల్లాలో అప్పుడు చెరువులు, కుంటలు నిండి పచ్చని పొలాలు కనిపించేవని, ఇప్పుడు అంతా ఎండిపోయిందని, ఇటు ఉద్యోగాలు లేవు, అటు వ్యవసాయం లేదని ఆ జిల్లా వాసులు వాపోతుండటం గమనార్హం.

ఒక్క ఉద్యోగాల విషయంలోనే కాదు, అన్ని హామీల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి ఇలానే ఉన్నది. గత ప్రభుత్వం అమలుచేసిన పథకాలు యథావిధిగా అమలు చేయాలంటేనే ప్రభుత్వ ఖజానాలో నిధులు లేవు, ఇంకా ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఇతర పథకాలకు నిధులెక్కడివి? సాధారణంగా ఏ పార్టీ అయినా అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం కన్నా ఎక్కువ పథకాలు అమలుచేయాలని, గత ప్రభుత్వం కన్నా తమ ప్రభుత్వమే ఉత్తమం అని నిరూపించుకోవాలని చూస్తుంది. అదనం మాట దేవుడెరుగు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలు సైతం అమలుచేసే స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదు. సచివాలయంలో లంకె బిందెలుంటాయనుకున్నాను, అలా ఏమీ లేవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన ప్రజలను ఆలోచింపజేస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపై ఇప్పటికే ముఖ్యమంత్రి నాలుగైదు సార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించారు. భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంచాలనేది అందులో వచ్చిన ఒక ఆలోచన. కానీ, రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే రియల్ ఎస్టేట్ బాగా పడిపోయింది. హైదరాబాద్ ప్రధాన నగరంపై ప్రభావం తక్కువే కానీ ఇతర ప్రాంతాల్లో కోట్ల రూపాయలు పలికిన వ్యవసాయ భూముల ధరలు పడిపోయాయి. అమ్మకాలు, కొనుగోళ్లు లేవు. క్రయవిక్రయాలు తగ్గిపోయినప్పుడు ఆదాయం ఎలా పెరుగుతుంది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్‌ను నాలుగు వేలకు పెంచుతామని నాడు హామీ ఇచ్చారు, ఏడు నెలలు గడిచిపోయినా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఆ హామీని అమలుచేయలేదు. వ్యవసాయ రుణమాఫీకి రేషన్‌కార్డు లంకె పెట్టి రైతుబంధు కొందరికే పరిమితం చేసి ఈ భారాన్ని సగం తగ్గించుకోవాలనే ప్రయత్నాలు జరుపుతున్నారు.



## కుక్కలున్నాయి... కూనలు జాగ్రత్త

**'వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతి' అనే వార్త చదివాక నా హృదయం కకావికలమైంది. దాడిచేసిన కుక్కలు ఆ చిన్నారిని పీక్కుతిన్న విధానాన్ని వీడియోలో చూసిన ప్రతి వ్యక్తి గుండె కన్నీరు కార్చకుండా ఉండదేమో! తాజాగా హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో జరిగిన వీధికుక్కల దాడి సంఘటన యావత్ ప్రజానీకాన్ని కదిలించింది. అయితే చిన్నారులపై వీధి కుక్కల దాడి ఘటనలు తరచూ జరుగుతుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది.**

గతంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయి. నిద్రలో లేచి గుడిసె నుంచి బయటకువచ్చిన బాలుడిని అర్ధరాత్రి వేళ వీధి కుక్కలు దాడిచేసి చంపాయి. ఈ సంఘటన ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. అయితే ఇక్కడ గమనించాల్సిన ఒక ముఖ్య విషయం ఏమంటే... కార్లలో తిరిగే ఉన్నత వర్గాల పిల్లలో, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి ప్రదేశాల్లో నివసించే అత్యున్నత వర్గాల పిల్లలో కాదు కుక్క కాట్లకు బలయ్యేది. రాష్ట్ర నలుమూలల నుంచి నగరానికి వలస వచ్చి, గుడిసెల్లో బతుకుతున్న, రెక్కాడితేగానీ డొక్క నిండని పేద వర్గాల పిల్లలే వీధికుక్కల దాడులకు బలవుతున్నారు.

ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పుడు మాత్రమే స్పందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం శునక నియంత్రణ పద్ధతులను పాటిస్తున్నామని చెప్తున్నది. అయినా వాటి సంఖ్య మాత్రం తగ్గడం లేదు. పైగా వీటి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని గణాంకాలు తెలియజేస్తున్నాయి. కాగా, ఏటా ఫిబ్రవరి నుంచి ఆగస్టు మాసాల మధ్య వీధికుక్కల దాడులు తీవ్రతరమవుతున్నాయని కొన్ని సర్వేలు వెల్లడిస్తున్నాయి.

**కుక్కల దాడులకు ముఖ్య కారణం వాటికి తగిన ఆహారం లభించకపోవడమే. గతంలో ప్రతి వీధికో చెత్తకుండీ ఉండేది. తినగా మిగిలిన ఆహార పదార్థాలను వీధిలోని ప్రజలు ఆ కుండీల్లో వేసేవారు. ఆ రోజుల్లో కుక్కలకు అదే ఆహారమయ్యేది. అయితే నగరాల సుందరీకరణలో భాగంగా నగరాల్లోని చెత్తకుండీలు మాయమయ్యాయి. వాటి స్థానంలో ఇంటింటికీ చెత్త తరలింపు వాహనాలు వస్తున్నాయి. ఇక ప్రజలు తినగా మిగిలిన ఆహార పదార్థాలన్నీ దూరంగా, ఎక్కడో ఉన్న డంప్ యార్డుకు చేరుకుంటున్నాయి.**

ఆకలి మనిషిని మృగంగా మారుస్తుందన్నాడొక మేధావి. వివేకం ఉన్న, అన్నీ తెలిసిన మనిషే ఆకలితో మృగంగా మారుతున్నప్పుడు నోరులేని జంతువులైన శునకాలు మృగాలుగా మారడంలో ఆశ్చర్యం లేదు. అందుకే పసి పిల్లల మీద వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. శునకాల ఆకలి సమస్యకు వెంటనే పరిష్కారం వెతకకపోతే కుక్కల దాడులకు పిల్లలు మాత్రమే కాదు, రానున్న రోజుల్లో పెద్దలు కూడా బలి కావాల్సి వస్తుంది. ఇంతటి తీవ్రమైన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. పరిష్కారంగా తూతూ మంత్రంగా సాగే శునక నియంత్రణ కార్యక్రమాన్ని ప్రధాన కార్యక్రమంగా నిర్వహించాలి. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లో పాటిస్తున్న శునక నియంత్రణా విధానాలను పరిశీలించి సాధ్యమైతే, రాష్ట్రంలోనూ అమలుచేయాలి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు దేశాల్లో రకరకాల జంతువులకు రకరకాల పార్కులున్నాయి. మన దేశంలోనూ జింకల కోసం పార్కులున్నాయి. భయంకరమైన జంతువులు సింహాలు, పులుల కోసం వేల ఎకరాల అభయారణ్యాలున్నాయి. కానీ, చిన్నపిల్లలపై దాడులు చేస్తున్న శునకాలకు పార్కులు లెవ్వు. కాబట్టి కుక్కలకు కూడా నగరాలకు దూరంగా పార్కులను ఏర్పాటుచేయాలి. చదువడానికి విచిత్రంగా అనిపించవచ్చు కానీ, కుక్కల కోసం పార్కులను ఏర్పాటుచేసి, అవి ఆ పార్కు దాటిరాకుండా కంచెలను నిర్మించి, ఎప్పటికప్పుడు వాటికి ఆహారం అందిస్తే క్రమంగా కుక్కల సంఖ్యను నియంత్రించవచ్చు. అప్పుడే మనుషుల మీద కుక్కల దాడుల ఘటనలు తగ్గుతాయి. ఏదేమైనా పిల్లలపై వీధి కుక్కల దాడుల ఘటనలను ప్రభుత్వాలు తేలికగా తీసుకోవద్దు. రాష్ట్ర స్థాయిలోనే కాదు, జాతీయస్థాయిలోనూ ఈ అంశం చర్చలు జరపాల్సిన అవసరం ఉన్నది.



**బసవరాజు నరేందర్ రావు**
99085 16549

## గాయమైన తెలంగాణ

అభివృద్ధి ఆగమైంది
తెలంగాణకు గాయమైంది
ప్రజా సంక్షేమం పాడైపోయింది

**ప్రగతి పక్కదారి పట్టింది**
**సంక్షేమం సావు బతుకుల్లో ఉన్నది**
**కొన జీవితో కొట్టుకుంటున్నది**

నీరు లేక చెరువు
నింగి చినుకు చూస్తుంది
మాగాని లేక
మా పల్లె మూగబోయింది

**కల్యాణలక్ష్మి తులం బంగారం**
**హామీలు అడుగున పడిపాయే**
**గద్దెనెక్కినాక గళం సుత్తి తప్పే**
**హామీల పథకాలు అమలు మతి తప్పే**

ప్రజావాణి చుట్టూ
ప్రజలు తిరుగుతుండ్రు
నెరవేరని హామీలను
నెమరేసుకుంటున్నది జనం

**ప్రజా పాలన**
**తప్పుడు తోవులో తొక్కిసలాట**
**గత పరిపాలన గంభీరంగా ఉన్నదని**
**మతి తప్పకుండా యాజ్జేసుకుంటున్నది**

**దేవరహోక కృష్ణయ్య**
99634 49579



# సీఎం గారూ.. కులగణన ఎప్పుడు?

**రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా బీసీ కులగణన హామీని నెరవేర్చకపోవడంపై పలు బీసీ సంఘాలు మండిపడ్డాయి. ఇప్పటివరకు సమగ్ర కులగణన జరపకపోవడం, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కామారెడ్డి డిక్లరేషన్ కార్యరూపం దాల్చకపోవడంపై ఆయా సంఘాల నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిలదీశారు. విధివిధానాలు ప్రకటించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేందుకు కాంగ్రెస్ సర్కార్ సమాయత్తమవుతుండటాన్ని వాళ్లు తప్పుబట్టడమే కాదు, ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ సారాంశం.**



### గౌరవనీయులైన సీఎం గారికి..

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన జరిపి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. దీనిపై గత రెండు నెలలుగా బీసీ జనసభ, బీసీ కులాలు, బీసీ సంఘాలు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మీ ప్రభుత్వం స్పందించడం లేదు. మొక్కుబడిగా శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టి, చేతులు దులుపుకొన్నారే తప్ప ప్రణాళికాబద్ధంగా ఒక కార్యాచరణకు పూనుకోలేదు. పైగా ఈ అంశాన్ని ఇప్పుడు లీగల్ ఇష్యూలోకి నెట్టివేయాలని చూస్తున్నారు. కొం తమంది ప్రైవేట్ వ్యక్తులతో కేసులు వేయించి, ఆలస్యమైతే రాజ్యాంగ సంక్షోభం వస్తుందని చెప్పించి, ఎన్నికలు వెంటనే నిర్వహించాలంటూ కోర్టు ఆదేశాలు వచ్చేలా కుట్రలు చేస్తున్నారు. నోటితో మాట్లాడి, నొసటితో వెక్కిరించినట్టుగా మీ వ్యవహారశైలి ఉంది. మీ వైఖరి వల్ల బీసీల రాజకీయ అవకాశాలకు తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉన్నది.

ఇటీవల మీరు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష జరిపారు. ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాలని, వీలైతే కులగణన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, మాజీ మంత్రి జానారెడ్డి సలహాలు తీసుకోవాలని సెలవిచ్చారని వార్తలు వచ్చాయి. ఇక్కడే తమరి చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తున్నది. ఎందుకంటే, గతంలో పంచాయతీరాజ్ మంత్రిగా పనిచేసిన జానారెడ్డి స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 33 శాతం రిజర్వేషన్లు 22 శాతానికి పడిపోవడానికి ప్రధాన కారకుడనే ఆరోపణలున్నాయి.


2004-2014 వరకు ఉమ్మడి ఏపీలో కొందరు బీసీ వ్యతిరేకులు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 33 శాతం ఉండటం వల్ల రిజర్వేషన్లు 50 శాతం పరిమితి దాటుతుందని, అది రాజ్యాంగ వ్యతిరేకమని హైకోర్టుకు వెళ్లారు. అదృష్టవశాత్తూ జస్టిస్ రోహిణి బీసీలకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. కానీ, అదే బీసీ వ్యతిరేకులు జస్టిస్ రోహిణి తీర్పును సవాలు చేస్తూ హైకోర్టు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ వల్ల స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటుతున్నదని, దాన్ని 50 శాతం పరిమితికి లోబడేటట్టు తగ్గించుకోవాలని హైకోర్టు ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. దీనికి ప్రధాన కారణం నాటి ప్రభుత్వం, ముఖ్యంగా అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి జానారెడ్డిలే. ఆయన సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున సవాలు చేయకపోవడంతోనే అప్పుడు అన్యాయం జరిగింది. చివరకు 2018లో హైకోర్టు ట్రిబ్యునల్ తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తద్వారా నేడు బీసీల రిజర్వేషన్లు 22 శాతానికి తగ్గే పరిస్థితి వచ్చింది. తమరు కులగణన, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే సాధ్యాసాధ్యాలపై ఇప్పుడు జానారెడ్డి సలహాలు తీసుకోవాలని అధికారులకు సూచించడం మాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది.

**ఓటర్ జాబితా ఆధారంగా కులగణన చేద్దామని మీరు చెప్తున్నారు. కానీ, ఓటర్ జాబితాలో ఎక్కడా కుల ప్రస్తావన ఉండదు. కుల అస్తిత్వ ప్రస్తావన లేని ఓటర్ జాబితా ఆధారంగా కులగణన ఎలా చేస్తారు. అశాస్త్రీయంగా కులగణ న చేసి, న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టి, బీసీలకు రిజర్వేషన్లను అడ్డుకోవాలనే కుట్ర మీ చర్యల్లో స్పష్టంగా కనిపిస్తున్నది.**

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కులగణన చేసిన విషయం మీకు తెలిసిందే. గతేడాది బీహార్‌లోనూ సమగ్ర కులగణన నిర్వహించడమే కాకుండా ఈడబ్ల్యూఎస్ కలుపుకొని రిజర్వేషన్లను 75 శాతానికి పెంచి, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలు, ఎంబీసీలకు పెద్దఎత్తున అవకాశాలు కల్పించారు. కాబట్టి, సమగ్ర కులగణన చేయకుండా ఉండేందుకు తమరు దారులు వెతకడం మానేసి, తక్షణమే దాని కోసం విధివిధానాలను రూపొందించాలి. వాటికోసం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. న్యాయపరమైన చిక్కులు రాకుండా బీహార్, కర్ణాటక లాంటి రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకోవాలి. అందుకోసం సామాజిక వర్గాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన, సామాజిక శాస్త్రవేత్తలు, న్యాయకోవిదులైన ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు సలహాలు తీసుకోవాలి.

సమగ్ర కులగణన హామీ కాంగ్రెస్ పార్టీ జాతీయ మ్యానిఫెస్టోలో ఉన్నది. సమగ్ర కులగణన చేసి, ఓబీసీ జనాభా లెక్కలు తీస్తామని, తద్వారా అన్నిరంగాల్లో ఎవరి వాటా ఎంతో తేలుస్తామని రాహుల్‌గాంధీ దేశమంతా కలియదిరిగి ప్రచారం చేశారు. మీరు మాత్రం కులగణనపై మీనమేషాలు లెక్కిస్తున్నారు. కులగణన బీసీ సమాజానికి జీవన్మరణ సమస్య. పదే పదే మీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు పదవులు ఇస్తూ.. బీసీ సమాజాన్ని అవమానిస్తున్నది మీరు కాదా? గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 65 సీట్లు ఇవ్వాల్సి ఉన్నది. కాంగ్రెస్ ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం 34 సీట్లు ఇవ్వాల్సి ఉండగా, 20 సీట్లు మాత్రమే ఇచ్చారు. ఇక మీరు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మీరు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పదవులు, నామినేటెడ్ పదవులన్నింటిలోనూ బీసీలకు అన్యాయమే జరిగింది. అందుకే కులగణనపై ప్రభుత్వం తక్షణమే ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. లేకుంటే త్వరలోనే బీసీ జనసభ, వివిధ బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తాం.

**– డి.రాజారాం యాదవ్, బత్తుల సిద్దేశ్వర్లు, కరుణాకర్ ముదిరాజ్, లొడంగి గోవర్ధన్, కొండూరు సత్యనారాయణ, మేకల కృష్ణ, కొంగర నరహరి, కొంపెల్లి రాజు, బొడ్డుపల్లి లింగం, భారి అశోక్**




## తుగ్లక్ దర్బార్‌ను తలపిస్తున్నది!

*ప్రైవేట్ రంగంలో కన్నడిగులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కర్ణాటక క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని మొదట మీరు (ముఖ్యమంత్రి సిద్ధరామయ్య) సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆ తర్వాత కొంతసేపటికి దాన్ని తొలగించారు. అనంతరం మళ్లీ.. క్యాబినెట్‌లో అలాంటి నిర్ణయమేమీ తీసుకోలేదని చెప్పారు. ఇది క్యాబినెట్‌లా లేదు, తుగ్లక్ దర్బార్‌ను తలపిస్తున్నది.*

**- ఆర్.అశోక్,** కర్ణాటక ప్రతిపక్ష నేత